సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 21 । మే । 2025



చీనీ టన్ను రూ.43,500
అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.43,500, కనిష్ఠంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



పైసలిస్తే.. అంతా ఓకే
ధర్మవరం ఎంటీఐ కార్యాలయం అవినీతికి నిలయంగా మారింది. డబ్బులిస్తే చాలు ఏ పనైనా క్షణాల్లో చేసేస్తున్నారు. దళారులను ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.4°/22.5°
వర్షాల ప్రభావంతో జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు 6,261 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర రిజర్వాయర్‌లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. మంగళవారం నాటికి 6,261 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి నీటి నిల్వ 9 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర జలాశయం ఎగువ భాగం ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు, శివమొగ్గ, సాగర, శృంగేరి తదితర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరద డ్యాంలోకి వచ్చి చేరుతోంది. మంగళవారం డ్యాంలో 1,633 అడుగులకు గాను 1,587.07 అడుగులకు నీటి మట్టం చేరింది. అవుట్‌ఫ్లో 2,139 క్యూసెక్కులుగా నమోదైంది.

టీచర్ల బదిలీలకు వేళాయె

- నేటి నుంచి హెచ్ఎంల బదిలీలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, కార్పొరేషన్, మునిసిపాలిటీ యాజమాన్యాల స్కూళ్లలో మొత్తం 14,784 మంది హెచ్ఎంలు, టీచర్లు పని చేస్తున్నారు. వీరిలో 375 మంది ప్రధానోపాధ్యాయులు, 329 మంది పీఎస్‌హెచ్ఎంలు, 6,850 మంది స్కూల్ అసిస్టెంట్లు, 7,230 మంది ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులున్నారు. ముందుగా బుధవారం నుంచి ప్రధానోపాధ్యాయుల బదిలీలు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. హెచ్ఎం పోస్టులు 178 ఖాళీలున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు మునిసిపాలిటీ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న గ్రేడ్-2 హెచ్ఎంలు ఈనెల 31 నాటికి 5 ఏళ్ల సర్వీస్ పూర్తయ్యే వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థన బదిలీ కోరుకునేవారు (ప్రస్తుతం పని చేస్తున్న స్కూల్‌లో రెండేళ్లు పూర్తయిండాలి) కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని సీఈఓ రామచంద్రారెడ్డి మంగళవారం సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రెండు జిల్లాల కలెక్టర్లు హాజరవుతారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలతో రావాలన్నారు. సమావేశానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు.

సత్తెన్నా.. ఇదేంటన్నా!



- వైద్య శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో పరిస్థితి ఘోరం
- వైద్యసేవల్లో రాష్ట్రంలో 25వ స్థానంలో 'శ్రీసత్యసాయి' జిల్లా
- టీకాలు మొదలు పీహెచ్‌సీల వరకూ అన్నింటా అధ్వానమే
- తాజా గణాంకాల్లో బయటపడిన డొల్లతనం

☛ నెల రోజుల క్రితం లేపాక్షి సమీపంలోని చెరువు కట్ట వద్ద పొలానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వ్యక్తిని జాతీయ రహదారిపై అతి వేగంగా కారు ఢీకొంది. ప్రమాదంలో బైకుపై వెళ్తున్న వ్యక్తి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు లేపాక్షి పీహెచ్‌సీకి తరలించారు. అయితే, ఆస్పత్రిలో డాక్టర్ లేరు. ఇప్పుడే వెళ్లారని సిబ్బంది తెలిపారు. దీంతో క్షతగాత్రుడిని హుటాహుటిన హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

☛ రెండు వారాల క్రితం మడకశిర నుంచి శిరకు వెళ్లే మార్గంలో తెల్లవారుజామున పాదచారిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు గమనించి నీలకంఠాపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి.. మందులు అందుబాటులో లేవని తెలిపారు. దీంతో బాధితుడు మడకశిర వెళ్లి.. మందులు కొనుక్కొన్నాడు. సమయానికి దగ్గర డబ్బు లేకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి.. అప్పు తీసుకుని మందులు కొన్నట్లు బాధితుడు వాపోయాడు. ఈ రెండే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చాలా ఆస్పత్రుల్లో ఇదే దుస్థితి.


ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో స్త్రీల మరుగుదొడ్డికి తలుపులు లేకపోవడంతో కర్టెన్ వేసిన దృశ్యం


ధర్మవరం ఆస్పత్రిలో మార్చురీకి వెళ్లే మార్గం దుస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆయన రాష్ట్రానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. విచిత్రమేమంటే వైద్య ఆరోగ్య సేవల్లో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా ఆఖరి నుంచి రెండో స్థానంలో ఉంది. దీంతో అమాత్యులతోపాటు ఉన్నతాధికారులు కూడా జిల్లా అధికారులపై సీరియస్ అవుతున్నారు. ప్రభుత్వం ఏమీ చేయకపోతే తామేం చేయగలమని అధికారులు వాపోతున్నారు.

అన్నింటా వెనుకబాటే..
వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించిన శ్రీ సత్యసాయి జిల్లాలోని ఆస్పత్రుల్లో దుస్థితి నెలకొంది. తాజాగా వెల్లడైన గణాంకాల్లో డొల్లతనం బయటపడింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో మొత్తం 12 అంశాలపై మదింపు చేశారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లా 25వ స్థానంలో నిలిచింది. మానసిక వ్యాధుల నియంత్రణ మొదలు చిన్నపిల్లలకు టీకాలు వేసేవరకూ అన్నింటా జిల్లా వెనుకబడి ఉన్నట్లు వెల్లడైంది. 12 అంశాల్లో 100 మార్కులకు గాను 69 మార్కులతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో (26 వ స్థానం) నిలవగా.. 74.49 మార్కులతో శ్రీ సత్యసాయి జిల్లా 25వ స్థానంలో సరిపెట్టుకుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పట్టించుకునే దిక్కులేదు. అసాంక్రమిక వ్యాధుల (బీపీ, షుగర్, గుండెపోటు) స్క్రీనింగ్ సరిగా జరగడం లేదు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మందులు 40 శాతం మందికే అందుతున్నాయి. చివరకు హెల్త్ మిషన్ నుంచి వచ్చే నిధులను కూడా సరిగా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది.

శ్రీ సత్యసాయి జిల్లా స్థానం ఇలా

కేటగిరీ	ఎన్ని మార్కులకు	వచ్చిన మార్కులు
మానసిక వ్యాధులు	15	10.01
చైల్డ్‌హెల్త్-టీకాలు	10	8.85
ఫ్యామిలీ ప్లానింగ్	05	1.43
వెల్‌నెస్ సెంటర్లు	10	9.69
బాలస్వాస్థ్య	05	3.40
ఎన్‌సీడీ, సీడీ	10	5.73
అర్బన్‌హెల్త్	10	8.40
నాణ్యతా ప్రమాణాలు	04	1.47
పీహెచ్‌సీల పనితీరు	10	7.23
హెల్త్‌సొసైటీ పనితీరు	05	3.47

మంత్రి ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో..?
ఉన్నఫళంగా ఎన్నికలకు పది రోజుల ముందు ధర్మవరం నుంచి బీజేపీ తరఫున నామినేషన్ వేసి గెలిచిన సత్యకుమార్ యాదవ్... నియోజకవర్గానికి రావడం అరుదు అని అంటుంటారు అక్కడి జనం. ఇక నియోజకవర్గానికే సరిగా రాని ఆయన జిల్లాకు సంబంధించిన అభివృద్ధి ఏం చూస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి చుట్టపు చూపుగా రావడం, వెళ్లిపోవడం చేస్తుండటంతో నియోజకవర్గంలో పంచాయితీలు, కార్యకర్తల వివాదాలు అన్నీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న హరీష్ చూసుకుంటున్నారు. ఇదిలా ఉంటే శ్రీసత్యసాయి జిల్లాలోనే కాదు అనంతపురం జిల్లాలోనూ పరిస్థితి ఇలాగే ఉంటుందని సామాన్యులు అభిప్రాయపడుతున్నారు.

'సూపర్' సేవలు మెరుగు పడాలి

- డీఎంఈ నరసింహం


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో స్పెషాలిటీ సేవలు మరింత మెరుగుపడాలని సంబంధిత వైద్యాధికారులకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం సూచించారు. మంగళవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. రోగులకందుతున్న సేవలు, రోజూ ఎన్ని శస్త్రచికిత్సలు చేస్తున్నారు, తదితర అంశాలపై ఆరా తీశారు. రోగుల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆ దిశగా వారిలో నమ్మకం కల్గించేలా చూడాలన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతం చేసి త్వరలో అందుబాటులో తీసుకురావాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల వైద్యులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. ప్రధానంగా సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం బోధనాస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనపై జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు వినతి పత్రం అందించారు. పరికరాలు, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించేలా చూడాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

- ఎంపీడీఓలను హెచ్చరించిన కలెక్టర్ టీఎస్ చేతన్
- స్వచ్ఛతా కార్యక్రమాలతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశం


ఎంపీడీఓలతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ''పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలంతా రోగాలకు దూరంగా ఆరోగ్యంగా ఉంటారు. అందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలి. ఎంపీడీఓలంతా ఈ కార్యక్రమాలు పర్యవేక్షించాలి. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించలేది లేదు. కఠిన చర్యలకూ వెనుకాడబోం'' అంటూ కలెక్టర్ చేతన్ ఎంపీడీఓలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమయ్యారు. మండల స్థాయిలో జరిగే అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ నెల స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 'నీరు-మీరు' అనే థీమ్‌తో నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ భవనాలు, బహిరంగ ప్రదేశాల్లోని నీటి సేకరణ నిర్మాణాలను శుభ్రపరచడంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నీటి సేకరణను ఉపయోగించుకోవడానికి ఈ మూడు వారాల ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు, భూగర్భ జల వినియోగంపై సమీక్షించారు. జిల్లాలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ 100 శాతం జరగాలన్నారు. లేపాక్షి, హిందూపురం, రొళ్ల, అగళి, నల్లమాడ, తనకల్లు, కొత్తచెరువు మండలాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ పక్కాగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో ఎక్కడ తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడా కూడా చెత్త సేకరణ, రవాణాకు ఉపయోగించే పరికరాలు నిరుపయోగంగా ఉండకూడదన్నారు. సమావేశంలో డీపీఓ సమత, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునప్ప, గ్రామ/వార్డు సచివాలయాల నోడ్ అధికారి సుధాకర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి పడేలా పథకాలు అమలు చేయాలి..
సంక్షేమ పథకాలు ప్రజలు సంతృప్తి పడేలా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ మెరుగుదలపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పక్కాగా పంపిణీ చేయాలన్నారు. అన్న క్యాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ఓ పర్యవేక్షించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. 'దీపం' పథకం కింద గ్యాస్ డెలివరీకి అదనపు మొత్తాన్ని వసూలు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

'పల్లె'వించిన కక్ష రాజకీయం

- పుట్టపర్తిలో బీజేపీ, జనసేన నేతలను టార్గెట్ చేసిన 'పల్లె'
- ఎదురొస్తే తాట తీయిస్తానంటూ బెదిరింపులు
- ఇప్పటికే బీజేపీ నేత ఆదియాదవ్‌కు ఇబ్బందులు
- తాజాగా జనసేన నేత పసుపులేటి రమేశ్ అరెస్టు
- మాజీ మంత్రి దెబ్బకు అల్లాడిపోతున్న కూటమి నేతలు



సాక్షి, పుట్టపర్తి: ఆయనో విద్యాధికుడు...కొన్నేళ్లపాటు పిల్లలకు పాఠాలు చెప్పారు. కానీ రాజకీయంలోకి దిగాక కొత్త పాఠం నేర్చుకున్నారు. ప్రశ్నిస్తే బెదిరించడం... ఎదురొస్తే దాడులు చేయించడం ద్వారా తనకు ఎదురేలేకుండా చేసుకుంటున్నారు. ముఖ్యంగా కూటమిలోని జనసేన, బీజేపీ నేతలను టార్గెట్ చేశారు. 'ఇది కూటమి ప్రభుత్వం... మేమంతా ఒక్కటే' అంటూ ఆయా పార్టీల నేతలు ఊరూరా చెప్పుకుంటూ తిరుగుతుండగా... పుట్టపర్తిలో మాత్రం 'పల్లె' మిత్రపక్షాల నేతలను టార్గెట్ చేశారు. అధికారం అడ్డు పెట్టుకుని.. పోలీసులతో రాజకీయం చేస్తూ కేసులు, అరెస్టులు అంటూ బీజేపీ, జనసేత నేతలను నిత్యం వేధిస్తున్నారు. తమ ప్రభుత్వంలో తమపైనే దాడులు జరుగుతున్నా బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

బీజేపీ నేతలపై కక్ష సాధింపు..
పెనుకొండ సమీపంలోని 'కియా' కార్ల పరిశ్రమ వద్ద గతంలో తన అనుచరులు, స్నేహితులను కలుపుకుని వందల ఎకరాల భూమి కొన్నారు. ఆ తర్వాత విలువ ఆధారంగా పంపకాలు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత వాటాల్లో తేడా కారణంగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అడ్డం తిరిగినట్లు ఆరోపణలున్నాయి. కొందరు అల్లరి మూకలను రెచ్చగొట్టి.. పదే పదే రోడ్లు ధ్వంసం చేయించడం.. బీజేపీ నేత ఆదినారాయణయాదవ్‌పై కేసు నమోదు చేయించడం పనిగా పెట్టుకున్నాడు. సుమారు రూ.80 కోట్లు విలువ చేసే భూమిని పల్లె రఘునాథరెడ్డి కబ్జా చేయాలని చూస్తున్నారని ఆదియాదవ్ ఆరోపిస్తున్నారు. గత ఆర్నెల్లుగా ఇద్దరి మధ్య వివాదాలు జరుగుతూనే ఉన్నాయి.

జనసేన నేతను చితకబాదించి..
అమడగూరు మండలానికి చెందిన జనసేన నాయకుడు పసుపులేటి రమేష్‌పై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కక్షగట్టారు. 'పల్లె' అవినీతికి సంబంధించిన సమాచారం మొత్తం తన వద్ద ఉందని రమేష్ చెప్పడంతో.. పల్లె భయపడిపోయినట్లు సమాచారం. అవన్నీ ఎక్కడ దాచారో చెప్పేవరకు చితకబాదాలని పోలీసులకు ఆదేశించినట్లు తెలుస్తోంది. కాగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై గతంలో పల్లె రఘునాథరెడ్డి చేసిన వ్యాఖ్యలను పసుపులేటి రమేష్ ఖండించినందుకే ఇద్దరి మధ్య వివాదం మొదలైంది. అక్కడి నుంచి రమేష్‌పై కక్ష సాధింపుల పరంపర కొనసాగుతోంది. ఇటీవలే షరతులతో కూడిన బెయిల్‌పై బయటికి వచ్చిన రమేష్‌ను పోలీసులు మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇప్పటి వరకు అరెస్టు చూపలేదు. దీంతో అతని తండ్రి 'నా కొడుకు ఆచూకీ తెలపండి స్వామీ, నా కొడుకు ఏమైపోయాడో అని అన్నహారాలు మాని ఎదురుచూస్తున్నాం' అంటూ ఆవేదన చెందుతూ విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పాత్రికేయులకూ బెదిరింపులు..
తన అవినీతి బాగోతాలన్నీ పత్రికల ద్వారా వెలుగులోకి తెచ్చిన పాత్రికేయులపైనా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కేసులు పెట్టించే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా కొందరు అల్లరి మూకలతో భౌతిక దాడి చేయించేందుకు కూడా వెనుకాడటంలేదు. ఈ క్రమంలోనే ఇటీవల ఓ పత్రికా ప్రతినిధిపై కక్ష గట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు.

'పల్లె' కనుసన్నల్లోనే పోలీసులు..
పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అయినప్పటికీ నియోజకవర్గ వ్యాప్తంగా పల్లె రఘునాథరెడ్డి ఆదేశాలతోనే పోలీసు వ్యవస్థ నడుస్తోందనే విమర్శలున్నాయి. ఎలాంటి హోదా లేకున్నా.. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ పోలీసులతో సెల్యూట్ చేయించుకుంటున్నారు. ఎలాంటి కేసయినా సరే తనకు చెప్పిన తర్వాతే నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే తనమాట వినని ఓ ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు వేయించారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

దీక్షిత్.. కొట్టాడు ఐఎఫ్ఎస్

మధ్య తరగతి కుటుంబం.. తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ పనులు చేసేవారు. అలాంటి ఇంట్లో పుట్టిన ఓ యువకుడు ఇప్పుడు ఆ మండలానికే ఆదర్శంగా నిలిచాడు. ఏకంగా యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో సత్తా చాటడంతో పాటు ఇంటర్వ్యూలోనూ రాణించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యాడు.

- యూపీఎస్సీ పరీక్షలో సత్తా చాటిన అమరాపురం యువకుడు
- ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 30వ ర్యాంకు కైవసం


కుటుంబీకులతో దీక్షిత్ (ఎడమ నుంచి మొదట)

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురానికి చెందిన పద్మ, ఈశ్వరప్ప దంపతుల కుమారుడు దీక్షిత్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యాడు. సోమవారం రాత్రి ఫలితాలు విడుదల కాగా, ఓపెన్ కేటగిరిలో ఏకంగా 30వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. అఖిల భారత సర్వీసులకు మండలం నుంచి ఎంపికైన తొలి యువకుడిగా చరిత్ర సృష్టించాడు.

మధ్య తరగతి కుటుంబం..
పద్మ, ఈశ్వరప్ప దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు మంజునాథ బెంగళూరులో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు దీక్షిత్ చిన్ననాటి నుంచే చదువుల్లో రాణించేవాడు. దీంతో ఈశ్వరప్ప ఎంతకష్టమైనా తన బిడ్డను బాగా చదివించాలనుకున్నాడు. వ్యవసాయంలో నష్టాలు వచ్చినా బిడ్డల చదువులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకున్నాడు. అందుకు తగ్గట్టుగానే దీక్షిత్ చిన్నపటి నుంచే చదువుల్లో బాగా రాణించేవాడు. అమరాపురంలోని స్ఫూర్తి పబ్లిక్ పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్న దీక్షిత్ ఆ తర్వాత ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం హార్టికల్చర్‌లో డిగ్రీ పట్టా తీసుకున్నాడు.

తొలి ప్రయత్నంలో విఫలమైనా...
దీక్షిత్ డిగ్రీ పట్టా తీసుకున్నాక అందరూ ఏదైనా ఉద్యోగం చూసుకోవాలంటూ సలహా ఇచ్చారు. కానీ అతను అప్పటికే కేంద్రం అఖిల భారత సర్వీసులకు నిర్వహించే యూపీఎస్సీ పరీక్షలు రాయాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు, తన సోదరునికి చెప్పి ఢిల్లీకి వెళ్లాడు. అక్కడ కోచింగ్ తీసుకుని యూపీఎస్సీ పరీక్ష రాశాడు. అయితే ప్రిలిమ్స్ కూడా దాటలేక పోయాడు. దీంతో అందరూ అతన్ని నిరుత్సాహపరిచారు. ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న కొద్దిపాటి డబ్బులు అయిపోవడంతో దీక్షిత్ ఆలోచనలో పడ్డాడు. కానీ యూపీఎస్సీని వదలకూడదనుకున్నాడు.

ఇంట్లో ఉంటూ చదువుకుని..
ఢిల్లీలో తీసుకున్న కోచింగ్‌తో దీక్షిత్‌కు యూపీఎస్సీలో ఎలా పరీక్ష రాయాలి, ఇంటర్వ్యూ ఎలా చేయాలో తెలిసింది. దీంతో మరోసారి పరీక్షకు సిద్ధమయ్యాడు. కొన్నిరోజులు అమరాపురంలో ...ఆ తర్వాత బెంగళూరులోని తన సోదరుడు మంజునాథ వద్ద ఉంటూ ప్రిపేర్ అయ్యి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ప్రత్యేకంగా నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేశాడు. మొదటి సారి చేసిన తప్పులు చేయకుండా రోజుకు 16 గంటల పాటు చదివేవాడు. అలా ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పాసయ్యాడు. ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలో నిర్వహించిన ఇంటర్వ్యూకు కూడా వెళ్లి వచ్చాడు. కానీ గట్టెక్కుతానా లేదా అన్న సంశయం..ఎప్పుడు బయట కనబడినా యూపీఎస్సీ ఫలితాలు వచ్చాయా అని దీక్షిత్‌ను అడిగేవారు. దీంతో అతను కూడా ఫలితం కోసం రెండు నెలలుగా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తూ గడిపాడు.


కష్టాన్ని మరిపించిన ఫలితం..
యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ కోసం నిర్వహించిన ఇంటర్వ్యూ ఫలితాలు సోమవారం రాత్రి వెల్లడయ్యాయి. ఇందులో దీక్షిత్ ఏకంగా ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 30వ ర్యాంకు సాధించాడు. దీంతో అతని ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన యువకుడు దేశంలోనే అత్యున్నత అఖిల భారత సర్వీసుకు ఎంపిక కావడంతో అతని స్వగ్రామం అమరాపురంలో పండుగ వాతావరణం నెలకొంది. దీక్షిత్‌ను స్నేహితులు, బంధువులు, కుటుంబీకులు అభినందనలతో ముంచెత్తారు.



అమ్మానాన్నకు అంకితం
ఈ ఫలితం మా అమ్మానాన్నకు అంకితం. ఎందుకంటే నేను యూపీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతానని చెప్పగా వారితో పాటు మా అన్న మంజునాథ నన్ను ప్రోత్సహించారు. తొలిసారి విఫలమైనా వెన్నుదన్నుగా నిలిచారు. నాకు ఏ లోటూ రాకుండా చూసుకున్నారు. కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా అఖిలభారత సర్వీసులు కొట్టవచ్చన్నదానికి నేనే ఉదాహరణ. నేను సర్వీసులోకి వచ్చాక నిరుపేద విద్యార్థులకు సాయంగా నిలుస్తా. – దీక్షిత్

శ్రీగంధం అలంకరణలో నెట్టికంటుడు

గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారు మంగళవారం శ్రీగంధం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేకువ జామునే స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. శ్రీగంధం అలంకరణలో తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ యాగశాలలో సుందరకాండ, మన్యుసూక్త వేద పారాయణం, శ్రీరామ ఆంజనేయ మూలమంత్ర అనుష్ఠానాల అనంతరం మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని ఆలయ ముఖ మండపంలో కొలువుదీర్చి సింధూరంతో లక్షార్చన చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


శ్రీగంధం అలంకరణలో నెట్టికంటుడు

క్లుప్తంగా

భార్య దాడిలో భర్త మృతి

- హత్య కేసుగా మార్పు

అనంతపురం: భార్య దాడిలో గాయపడిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనకు సంబంధించి ఇప్పటి వరకూ నమోదైన దాడి కేసును హత్య కేసుగా పోలీసులు మారుస్తూ రిమాండ్‌లో ఉన్న నిందితురాలిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వివరాలను అనంతపురం నాల్గో పట్టణ సీఐ కనుమూరి సాయినాథ్ మంగళవారం వెల్లడించారు. అనంతపురంలోని విద్యారణ్యనగర్ ఉర్దూ స్కూల్ సమీపంలో నివాసముంటున్న సయ్యద్ ఇస్మాయిల్ రెండో కుమారుడు షాజహాన్ (45)కు తాడిపత్రికి చెందిన సహోరాతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబకలహాల నేపథ్యంలో ఆరేళ్ల క్రితం దంపతులు విడిపోయారు. అదే సమయంలో షాజహాన్‌కు హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన ఈశ్వరమ్మతో పరిచయమైంది. అనంతపురంలోని కోవూర్ నగర్‌లో ఇమ్రాన్ మసీదు వద్ద అద్దె ఇంట్లో ఇద్దరూ సహజీవనం సాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే మూడేళ్ల క్రితం ఈశ్వరమ్మను షాజహాన్ పెళ్లి చేసుకున్నాడు. వీరికి 14 నెలల వయసున్న హమీల్‌బాబా అనే కుమారుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా షాజహాన్ మొదటి భార్య కుమారుడు తరచూ ఇంటికి వచ్చి వెళ్లేవాడు. దీంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. తన కుమారుడి రాకను ఆక్షేపిస్తుండడంతో ఈ నెల 1న రాత్రి షాజహాన్ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని ఈశ్వరమ్మతో గొడవపడ్డాడు. ఆ సమయంలో ఈశ్వరమ్మ రోకలి బండ తీసుకుని షాజహాన్ తలపై మోదింది. తీవ్ర రక్తస్రావమవడంతో అదే రోజు రాత్రి 11 గంటలకు సర్వజనాస్పత్రికి షాజహాన్‌ను తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాస్త కోలుకున్న తర్వాత ధర్మవరంలోని చెన్నకేశవపురంలో ఉన్న సోదరుడి ఇంటికి షాజహాన్ చేరుకుని వైద్యుల సూచన మేరకు రోజూ క్రమం తప్పకుండా చికిత్స కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కాగా, దాడి జరిగిన సమయంలో షాజహాన్ తండ్రి ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు ఈశ్వరమ్మపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేసి, ఈ నెల 3న అదుపులోకి తీసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆమె రిమాండ్ ఖైదీగా ఉంది. తాజాగా ఈ కేసును హత్య కేసుగా మారుస్తూ న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పైసలిస్తే.. అంతా ఓకే



టోపీ పెట్టుకుని ప్రైవేట్ పాఠశాలకు చెందిన వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఇతను.. ఓ ప్రైవేట్ డ్రైవర్. ధర్మవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన ఏకంగా ఎంవీఐ అవతారమెత్తి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు వచ్చిన ప్రతి వాహనాన్ని చెక్ చేస్తుంటాడు. ఆయన ఓకే చేస్తే చాలు మేడం గారు ఎలాంటి పరిశీలన చేయకుండానే వెంటనే అప్రూవల్ ఇచ్చేస్తారు. విద్యార్థులను నిత్యం పాఠశాలకు చేర్చే వాహనాల ఫిట్‌నెస్‌ను ఏ మాత్రం సంబంధం, అవగాహన లేని ప్రైవేట్ వ్యక్తితో చెక్ చేయించడం ఎంత ప్రమాదకరమో తెలిసినా సదరు ఎంవీఐ పట్టించుకోకపోవడం గమనార్హం.



ఎఫ్‌సీ కోసం వచ్చిన ప్రైవేట్ పాఠశాల వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎంవీఐ డ్రైవర్ (ప్రైవేట్ వ్యక్తి)

- అవినీతి కూపంలా మారిన ఎంవీఐ కార్యాలయం
- డ్రైవింగ్ లైసెన్స్, ఎల్ఎల్ఆర్, ఎఫ్‌సీలకు ఒక్కో దానికి ఒక్కో రేటు
- అధికారుల అండతో దళారుల దందా
- ఎంవీఐ అవతారమెత్తిన డ్రైవర్

ధర్మవరం: రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చొరవతో ధర్మవరంలో ఎంవీఐ కార్యాలయాన్ని 2024లో ప్రారంభించారు. ఏడాదిగా విశిష్ట సేవలను అందిస్తూ వచ్చిన ఈ కార్యాలయం ఇటీవల దళారుల దందాతో అవినీతి మయమైంది. కార్యాలయంలోని కొందరు కీలక సిబ్బంది, అధికారులు దళారులకు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఏ చిన్న పని కావాలన్నా ప్రజలు ముందుగా దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

మచ్చుకు కొన్ని..

- తాడిమర్రి మండలానికి చెందిన ఓ రైతు తన సొంత ట్రాక్టర్‌ను ధర్మవరం ఎంవీఐ కార్యాలయంలో ఎఫ్‌సీ చేయించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ప్రాసెస్ చేసేందుకు ఆర్టీఓ కార్యాలయ సమీపంలోని ఓ దళారిని ఆశ్రయించడంతో పని పూర్తి చేసేందుకు రూ.7వేలు కార్యాలయంలో లంచం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపాడు. దీంతో సదరు రైతు న్యాయం కోరుతూ స్పందనలో ఫిర్యాదు చేశాడు.
- ధర్మవరం పట్టణానికి చెందిన యువకుడు బాషా డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకుని ఎంవీఐ కార్యాలయానికి వెళ్లాడు. ఆరంభంలోనే ఓ దళారీ కలసి డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటే అధికారులకు రూ.1,500లు ఇవ్వాల్సి ఉంటుందని కండీషన్ పెట్టాడు. ఇందుకు బాషా నిరాకరించడంతో టెస్ట్‌లో ఫెయిలయ్యాడు. చివరకు మళ్లీ దరఖాస్తు చేసుకుని సదరు దళారీని ఆశ్రయించి డిమాండ్ మేరకు డబ్బు చెల్లించి డ్రైవింగ్ లైసెన్స్ పొందాడు.

ఆ ముగ్గురే కీలకం..

ఎంవీఐ కార్యాలయంలో ధర్మరంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి, బత్తలపల్లికి చెందిన మరో వ్యక్తి, కార్యాలయ అధికారికి సన్నిహితంగా ఉన్న ప్రైవేట్ వ్యక్తి అక్రమ దందాలో కీలకంగా మారారు. వీరు రోజూ కార్యాలయానికి సేవలు పొందడానికి వచ్చే వారిని సంప్రదించి తమ ద్వారా అయితే పని సులువు అవుతుందని నమ్మబలుకుతూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎల్ఎల్ఆర్ పొందాలంటే రూ.800, డ్రైవింగ్ లైసెన్స్‌కు అయితే రూ.1,500, వాహనాల ఎఫ్‌సీకి రూ.7వేలు వరకు డబ్బు డిమాండ్ చేస్తున్నారు. దళారుల దందాను అడ్డుకోవాల్సిన కార్యాలయ ఉన్నతాధికారి మిన్నకుండి పోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దళారుల డిమాండ్ మేరకు డబ్బు చెల్లించకుండా నేరుగా చేసుకున్న ప్రతి దరఖాస్తు తిరస్కరణకు గురవుతుండడమే ఇందుకు నిదర్శనం. దీంతో ప్రజలు కూడా చేసేదేమీ లేక డబ్బులిచ్చి పనులు పూర్తి చేయించుకుంటున్నారు.

దందా అరికట్టాలి



ధర్మవరం ఎంవీఐ కార్యాలయంలో దళారుల మాటే వేదవాక్కుగా మారింది. ప్రతి చిన్న పనికీ డబ్బు చెల్లించాల్సి వస్తోంది. లేకపోతే పనులు పూర్తి కాక ఇబ్బంది పడాల్సి వస్తోంది. దళారులను కాదని పోతే రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. – **ముసుగు మధు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, ధర్మవరం**

చర్యలు చేపడతాం



ధర్మవరం ఎంవీఐ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి వాహనాలు తనిఖీ చేయడం, దళారుల దందా నా దృష్టికి రాలేదు. ఈ విషయంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎంవీఐ కార్యాలయంలో సేవలు పొందేందుకు ఎలాంటి లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే నేరుగా సంప్రదించండి. – **కరుణసాగర్‌రెడ్డి, డీటీసీ**

నీట మునిగి వ్యక్తి మృతి

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నాగానిపల్లికి చెందిన శివప్ప(56) నీట మునిగి మృతిచెందాడు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి పక్కనే ఉన్న నీటి కుంట వద్దకు బహిర్భూమి కోసం వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. శివప్పకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'బెట్టింగ్' అప్పులు తీర్చలేక యువకుడి పరారీ

బత్తలపల్లి: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఓ యువకుడు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఇల్లు విడిచి పారిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన చింతపంటి చెన్నారెడ్డి కుమారుడు పురుషోత్తం రెడ్డి ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో బెట్టింగ్‌కు పెట్టుబడుల కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఈ అప్పులకు వడ్డీల భారం పెరగడంతో తీర్చలేక ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. బంధువులు, సన్నిహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి చెన్నారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై మంగళవారం గేదె మృతి చెందింది. వివరాలు.. చెన్నేకొత్తపల్లికి చెందిన ఓబుగారి సుబ్బిరెడ్డి పాడి పెంపకంతో కుటుంబాన్ని పోషించుకొనేవాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పచ్చగడ్డి పెరగడంతో మేత కోసం రెండు గేదెలను గ్రామ నడిబొడ్డులో ఉన్న బయలు ప్రాంతానికి వదిలాడు. గేదెలు పచ్చగడ్డిని మేస్తూ ఉండగా అందులో ఒక గేదె సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టే వైర్‌ను తాకింది. స్టేవైర్‌కు విద్యుత్ ప్రసరించడంతో గేదె షాక్‌తో అక్కడి కక్కడే మృతి చెందింది. ఘటనలో రూ.80 వేలు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

వ్యక్తిపై కేసు నమోదు

గార్లదిన్నె: ప్రధాని నరేంద్రమోదీపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... కల్లూరుకు చెందిన మహబూబ్‌బాషా సోషల్ మీడియాలో దేశ ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన పోస్టులు పెట్టాడన్నారు. దీనిపై ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కేబుల్ దొంగల అరెస్టు

పావగడ: తిరుమణి సోలార్ పార్క్‌కు చెందిన వళ్లూరు గ్రామం అవధా సోలార్ ప్లాంట్‌లో కేబుల్ అపహరించిన దొంగలు పోలీసులకు చిక్కారు. రూరల్ సీఐ గిరీశ్ వివరాల మేరకు.. జనవరి 20న రాత్రి అవధా సోలార్ కంపెనీ సోలార్ ప్యానల్‌కు ఏర్పాటు చేసిన సుమారు రూ .2 లక్షల విలువ చేసే సుమారు 2,500 మీటర్ల డీసీ కేబుల్ వైరు చోరీకి గురైందన్నారు. దొంగతనానికి పాల్పడ్డ పావగడ పట్టణంలోని అఫ్ బండ ప్రాంతానికి చెందిన చోరులు మల్లేష్ అలియాస్ మల్లికార్జున, బాబు అలియాస్ బాబురావ్, మంజ అలియాస్ అణ్ణప్పలను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి డీసీ కేబుల్‌తో దొంగతనానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న నాగరాజును త్వరలో పట్టుకుంటామన్నారు.



స్వాధీనం చేసుకున్న కేబుల్, ద్విచక్ర వాహనాలు

'సూర్యఘర్'తో విద్యుత్ బిల్లు ఆదా



సోలార్ విద్యుత్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటిపై కప్పుపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు ఆదా అవుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే సింధూరారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సాయిఆరామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. అనంతరం సోలార్ విద్యుత్ స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 120 యూనిట్లు కరెంట్ ఆదా అవుతుందన్నారు. ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని విద్యుత్‌పొదుపుతో పాటు బిల్లులు కూడా తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, విద్యుత్ శాఖ డీఈలు శివరాములు, మోసస్‌పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అధినేతతో రామగిరి ఎంపీటీసీల భేటీ



వైఎస్ జగన్‌ను కలిసిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు

రామగిరి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన రామగిరి మండల ఎంపీటీసీ సభ్యులు మంగళవారం కలిశారు. రామగిరి ఎంపీపీ స్థానాన్ని అడ్డదారుల్లో దక్కించుకునేందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత సాగిస్తున్న కుట్రను భగ్నం చేస్తూ ఎన్నికకు ఎంపీటీసీలందరూ గైర్హాజరైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రామగిరి మండలంలో నెలకొన్న పరిస్థితులను వారు వైఎస్ జగన్‌కు వివరించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీటీసీ సభ్యులు సుజాతమ్మ, భారతి, వెంకటలక్ష్మమ్మ, ఆదిలక్ష్మి, బాలకొండయ్య, సాయిలీల, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, శంకరయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రూ.37 లక్షల మెస్ బిల్లులకు లెక్కల్లేవ్

- డీఎంఈకి నివేదించిన విచారణ కమిటీ
- అకౌంటెంట్ వాణిపై ఫిర్యాదు చేయాలని డీఎంఈ ఆదేశం

అనంతపురం మెడికల్: బోధనాస్పత్రిలో వైద్య విద్యార్థుల మెస్ బిల్లులకు సంబంధించి రూ.37 లక్షలకు లెక్కలు సరిగా లేవని విచారణ కమిటీ సభ్యులు డీఎంఈ డాక్టర్ నరసింహంకు తెలియజేశారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలోని లైబ్రరీలో జరిగిన విచారణను డీఎంఈ పరిశీలించారు. విచారణ కమిటీ, వార్డెన్లతో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలలో యూజీ విద్యార్థుల మెస్ బిల్లులు సంబంధిత అకౌంట్ నుంచి కాకుండా వైద్య విద్యార్థుల అకౌంట్ నుంచి అకౌంటెంట్‌కు వెళ్లినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు విచారణకు ఆదేశించారు. డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ సురేష్ తదితరులతో కమిటీ ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టిన కమిటీ సభ్యులు.. నలుగురు విద్యార్థుల వ్యక్తిగత అకౌంట్లకు ఒకరి ఖాతాలో రూ.30 లక్షలు, మరొకరి ఖాతాలో రూ.5 లక్షలు, ఇంకొకరి ఖాతాలో రూ.2 లక్షల వరకు జమ చేసినట్లు, వారి ద్వారా అకౌంటెంట్‌కు వెళ్లినట్లు గుర్తించారు. అందులో రూ.17 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు గోల్‌మాల్ జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ విషయంలో వార్డెన్ డాక్టర్ సుచిత్ర, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ విజయ, తదితరుల పర్యవేక్షణ లోపం ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు నివేదికలో పేర్కొన్నారు. ఈ క్రమంలో అకౌంటెంట్ వాణిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావును డీఎంఈ నరసింహం ఆదేశించారు.

విచారణ వేగం.. చర్యలు శూన్యం

- నివేదికలు కచ్చితంగా ఉన్నా.. రెడ్డెప్పశెట్టిపై చర్యలకు అధికారుల వెనకడుగు
- భారీగా అక్రమాలు జరిగినా పట్టించుకోని వైనం

చిలమత్తూరు: రియల్టర్ రెడ్డెప్పశెట్టి వ్యవహారంలో అధికారుల ఉదాసీనత బట్టబయలవుతోంది. భూ అక్రమాల మొదలు కంచె వేయడం, రైతుల పొలాలకు దారులు మూసివేయడం, ఈడీ అటాచ్‌మెంట్ భూముల్లో ఉద్యాన పథకాలతో పాలీహౌస్‌లు, కమ్యూనిటీ ఫారంపాండ్ల లబ్ధి పొందడం, విద్యుత్ చౌర్యం, రైతులను వేధించడం వంటి వాటిపై ఇప్పటికే 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. వీటిపై అధికార యంత్రాంగం కూడా చాలా వేగంగా స్పందిస్తూ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు నివేదికలు సైతం జిల్లా ఉన్నతాదికారులకు అందించారు. అక్రమాలు, ఆక్రమణలు వాస్తవమని నివేదికలో స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ఎవిక్షన్ నోటీసులు జారీ అయ్యాయి. అనంతరం తదుపరి చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

డబుల్ ఎంక్వైరీలు కాలతీతానికేనా?

రెడ్డెప్పశెట్టి వ్యవహారంలో క్షేత్రస్థాయిలో అధికారులు తొలిసారి విచారణ పూర్తి చేసి పక్కా సమాచారంతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కాస్త దానిని తొక్కిపెట్టి మరో విచారణకు సిద్ధమయ్యారు. ఈ విచారణనూ అత్యంత గోప్యంగా నిర్వహించారు. రెండోసారి కూడా విచారణలో అక్రమాలు, ఆక్రమణలు వాస్తవంటూ నిర్ధారిస్తూ అధికారులు నివేదికలు అందజేసినట్లు సమాచారం. అయినా రెడ్డెప్పశెట్టిపై ఎలాంటి చర్యలూ లేవు. కాగా, రియల్టర్‌కు సమయం ఇచ్చేందుకే అధికారులు రెండు పర్యాయాలు విచారణలు చేపట్టినట్లుగా రైతులు, ప్రజలు పేర్కొంటున్నారు. అధికారుల చర్యలతో రియల్టర్ రెడ్డెప్పశెట్టి వ్యూహాత్మకంగా తప్పించుకునేందుకు మార్గం సుగమం చేసినట్లుగా అనుమానాలు వ్యక్తం చేశారు.

ఏపీఐఐసీ ఎవిక్షన్ నోటీసు గడువు కూడా పూర్తి..

రెడ్డెప్పశెట్టి పాలీహౌస్‌లు, కమ్యూనిటీ ఫారంపాండ్‌లు, ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని ఆక్రమించుకోవడం తదితరాలను విచారణ ద్వారా ఏపీఐఐసీ ధ్రువీకరించింది. వాటిని వారం రోజుల్లోపు తొలగించాలంటూ ఎవిక్షన్ నోటీసును ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ జారీ చేశారు. ఈ గడువు కూడా ముగిసిపోయింది. అయినా రెడ్డెప్పశెట్టిలో చలనం లేకపోయింది. ఇలా ప్రతి శాఖ నుంచి జారీ అయిన నోటీసులను ఆయన పరిగణనలోకి తీసుకోకపోవడం వెనుక ఓ ఉన్నతాధికారి పూర్తిగా సహకరిస్తున్నాట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్‌శాఖ ఏఈ చేపట్టిన విచారణలో పాలీ హౌస్‌లకు అనధికారికంగా విద్యుత్‌ను ఇష్టారాజ్యంగా వాడుకున్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఇప్పటికీ విద్యుత్ శాఖ నుంచి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

కనిపించని చర్యలు..

ఇరిగేషన్, ఏపీఐఐసీ, రెవెన్యూ మూడు శాఖలూ ఎవిక్షన్ నోటీసులు ఇచ్చి, వాటి సమయం కూడా దాటిపోయింది. ఇలాంటి తరుణంలో అధికారిక చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం కాలయాపన చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. రియల్టర్ నుంచి భారీ మొత్తంలో ముడుపులు దండుకుని రెడ్డెప్ప శెట్టికి అన్ని విధాలుగా అండగా నిలిచారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా రెడ్డెప్పశెట్టి ఇటీవలే రెవెన్యూశాఖకు ఒక లేఖను పంపారు. అందులోని సారాంశం ఏమిటంటే తాను ఏ విధమైన ఆక్రమణలు చేయలేదని పేర్కొంటూనే ఆక్రమణల తొలగింపునకు ఆరు నెలలు సమయం కావాలని అడగడం విశేషం.

రంగంలోకి ఈడీ?

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆధీనంలో ఉన్న భూములను ఇప్పటికే ఆక్రమించుకున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టి.. వాటిని రెవెన్యూ అధికారులను లోబర్చుకుని దక్కించుకునే ప్రయత్నాలు వేగవంతం చేశాడనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఈడీకి పలువురు రైతులు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. అక్రమాలకు అధికార యంత్రాంగం సహకరిస్తున్న తీరునూ లేఖలో ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఈడీ త్వరలో నేరుగా రంగంలోకి దిగే అవకాశాలు లేకపోలేదు.

ముగిసిన పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. శ్రీవారి ఉత్సవమూర్తులను భారీ ఊరేగింపుతో ఆమిద్యాల గ్రామానికి తరలించారు. ఉదయం ఆలయంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో ఆమిద్యాలకు తరలించారు. ఆమిద్యాల గ్రామంలోని పెన్నోబుళేసుడి ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, అక్కడ కొలువుదీర్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకేరమేష్ బాబు, అర్చకులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు..

పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ కానుకలు మంగళవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి పాండురంగారెడ్డి, దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారులు వన్నూరుస్వామి, కె.రాణి, ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో కానుకలు లెక్కించారు. 13 రోజులకు గాను కానుకల రూపంలో రూ.15.85 లక్షలు, అన్నదానం హుండీ ద్వారా రూ.8,212 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్లుకు చెందిన హనుమాన్ సేవా సమితి, ఉరవకొండ షిర్డీ సాయి ఆలయం, అనంతపురం ఫస్ట్‌రోడ్డు శివాలయం సేవా సమితి వారు పాల్గొన్నారు.



ఆమిద్యాలకు ఊరేగింపుగా తరలివెళ్తున్న శ్రీవారి ఉత్సవమూర్తులు

బదిలీల గోల.. విత్తన పంపిణీ జరిగేదెలా?

- వ్యవసాయశాఖలో 144 మందికి తప్పని స్థానచలనం
- విత్తన పంపిణీపై దృష్టి సారించని వైనం

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ముంచుకొస్తున్నా ఇప్పటికీ విత్తన ప్రణాళిక అమలుకు నోచుకోలేదు. విత్తన సేకరణ, విత్తనశుద్ధి, సరఫరా, పంపిణీ చురుగ్గా కొనసాగాల్సి ఉండగా... ప్రస్తుతానికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈ క్రమంలోనే వ్యవసాయ శాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో విత్తన పంపిణీ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. విత్తన పంపిణీలో మండల వ్యవసాయాధికారులు (ఎంఏఓలు), వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ)లు కీలకం. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖలో అన్ని విభాగాల పరిధిలో ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు ఏకంగా 144 మంది ఉన్నారు. వీరితో పాటు మరికొందరూ బదిలీకి దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో వ్యవసాయశాఖలో భారీ ఎత్తున బదిలీలు జరగనున్నాయి.

ఇబ్బందులు తప్పవు..

ఎటూ బదిలీ కాక తప్పదనే ఆలోచనతో చాలా మంది ఏఓలు, ఏఈఓలు విత్తన పంపిణీ ప్రక్రియ బాధ్యతలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. బదిలీల ప్రక్రియ జూన్ 2న ముగియనుండటంతో అంతవరకు విత్తన పంపిణీ ప్రక్రియ ప్రారంభమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాడిపత్రి, మడకశిర, ధర్మవరం పెనుకొండ, కదిరితో పాటు 'ఆత్మ' ఏడీఏలు కూడా బదిలీ కానున్నారు. 31 మంది ఏఓలు, 78 మంది ఏఈఓలు, మినిస్టీరియల్ స్టాఫ్ 20 మంది బదిలీ కానున్నారు. బదిలీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున విత్తన పంపిణీ ఆలస్యం కావడంతో పాటు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తన పంపిణీ చాలా ఆలస్యమయ్యేలా ఉంది. అదే జరిగితే రైతుకు తీరని నష్టం జరుగుతుంది.